
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

5 సిద్దిపేట
శుక్రవారం 7 ఫిబ్రవరి 2025

ఫైనాన్స్ వేధింపులు తాళలేక
ఒకరి ఆత్మహత్య
ప్రైవేట్ ఫైనాన్స్‌లో రూ.16 లక్షలు అప్పు
ఇంట్లో ఉరేసుకుని బలవన్మరణం
6

అమెరికాలో సేఫేనా?

ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి వందల్లో విద్యార్థులు
ఉన్నత చదువు కోసం వెళ్లి ఉద్యోగం చేస్తున్న వారిపై కొరడా
డిపోర్టేషన్ భయం గుప్పిట్లో విద్యార్థులు
పార్ట్‌టైమ్ ఉద్యోగం చేయకుండా అక్కడుండటం కష్టతరమే
ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు

అమెరికాలో ఉన్నత చదువులు చదివి.. మంచి ఉద్యోగం సంపాదించి ఉన్నతంగా ఉందామనుకున్న విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఇప్పుడు కంటిమీద కునుకు లేకుండాపోయింది. అమెరికా అధ్యక్షుడు తీసుకున్న నిర్ణయం.. ఉమ్మడి మెదక్ జిల్లాను ఉలిక్కిపడేలా చేసింది. విద్యార్థులు, ఉద్యోగుల కలల సౌధం అయిన అగ్రరాజ్యం విధించిన ఆంక్షల నడుమ తమ వారు ఎలా ఉన్నారనే ఆందోళన ఇక్కడి వారిలో వ్యక్తమవుతోంది. అమెరికా అధ్యక్షుడి ప్రకటన తర్వాత అక్కడి తమ వారి యోగక్షేమాలు తెలుసుకుంటూ.. ఇప్పటి వరకు ఎలాంటి ఉపద్రవం రాలేదన్న మాటతో ఊపిరిపీల్చుకుంటున్నా.. ఏ క్షణాన ఎలాంటి సమాచారం వినాల్సి వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు.

7





దౌలాపూర్‌లో పాఠశాలకు తాళం వేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

టీచర్లు లేని బడి ఎందుకు?

- తాళం వేసిన తల్లిదండ్రులు
- విద్యార్థులతో కలిసి నిరసన

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచర్లను నియమించాలని.. ఉపాధ్యాయులు లేని బడి ఎందుకంటూ విద్యార్థులతో కలిసి తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. పాఠశాలకు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం దౌలాపూర్ గ్రామంలో గురువారం జరిగింది. గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఏడు తరగతులకు ముగ్గురు మాత్రమే ఉపాధ్యాయులు ఉండటంతో చదువులు సక్రమంగా సాగడం లేదు. గతేడాది ఈ పాఠశాలలో 120 మంది విద్యార్థులు ఉండగా, ఉపాధ్యాయలు లేకపోవడంతో సుమారు40 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల్లో చేరారు. ప్రస్తుతానికి 80 మంది విద్యార్థులు ఉండగా, అందులోనూ కొందరు ప్రైవేట్ పాఠశాలలో చేరేందుకు సిద్ధపడుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో గురువారం పాఠశాలకు వచ్చిన తల్లిదండ్రులు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచర్లను నియమించాలని ఆందోళనకు దిగారు. పాఠశాలకు తాళం వేసి మండల వనరుల కేంద్రానికి వెళ్లి అక్కడ ఎంఈవోకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎంఈవో మాధవరెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారితో మాట్లాడి ఓ ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్‌పై నియమిస్తామని, మరో వారంలో ఇంకో ఇద్దరు ఉపాధ్యాయులను నియమిస్తామని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ వంటేరు యాదిలక్ష్మి శ్రీనివాస్‌రెడ్డి, కొండ పోచమ్మ మాజీ చైర్మెన్ ఉపేందర్‌రెడ్డి, గ్రామ నాయకులు సుధాకర్‌రెడ్డి, బోయిన పుల్లయ్య, మధు, నరసింహులు, భాస్కర్, జయమ్మ, నరసమ్మ, బంగారి పాల్గొన్నారు.

చెల్కలపల్లిని ముంపు
గ్రామంగా గుర్తించాలి

- ప్రత్యేక పునరావాస కేంద్రం ఏర్పాటు చేసి ప్యాకేజీ ఇవ్వాలి
- మంత్రి ఉత్తమ్‌కు మాజీమంత్రి హరీశ్‌రావు లేఖ

చిన్నకోడూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): చిన్నకోడూరు మండలం చెల్కలపల్లిని ముంపు గ్రామంగా గుర్తించి వారికి ప్రత్యేక పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్యాకేజీ ఇవ్వాలని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు లేఖ రాశారు. అనంతగిరి (అన్నపూర్ణ) రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా కోచ్చగుట్టపల్లిలోని 104 కుటుంబాలను నిర్వాసితులుగా గుర్తించి ప్యాకేజీ, ఆర్ అండ్‌ఆర్ కాలనీ నిర్మించామన్నారు. రిజర్వాయర్‌కు 50 మీటర్ల దూరంలో చెల్కలపల్లి గ్రామం ఉంటుందని, అప్పటి ఎఫ్‌ఆర్‌ఎల్‌లో గ్రామంలో రెండు కుటుంబాలు మాత్రమే ముంపునకు గురి కావడంతో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందజేశామన్నారు. ప్రస్తుతం అదనపు టీఎంసీకి సంబంధించిన పంప్‌హౌస్ పనుల్లో భాగంగా బ్లాస్టింగ్, డంపింగ్ యార్డ్, గ్రామం మూడు వైపుల రిజర్వాయర్ నీరు ఉందన్నారు. దీంతో ఇళ్లలోకి నీరు చేరడం, ఫోన్ సిగ్నల్స్ సరిగా రావడంలేదని, పనుల్లో భాగంగా రోడ్డు మార్గాన్ని తీసివేయడంతో సరైన రవాణా సౌకర్యం లేక గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారని తన దృష్టికి వచ్చిందని తెలిపారు. గతంలోనే ఈ సమస్యల పై కలెక్టర్‌కు, ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్‌కు లేఖ రాశారన్నారు. ఈ అంశాలను పరిగణలోకి తీసుకోని చెల్కలపల్లిని ముంపు గ్రామంగా గుర్తించి నిర్వాసితులకు ఇచ్చే ప్యాకేజీ, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ నిర్మాణం చేపట్టాలని హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు.

సెంటర్ల వద్ద పటిష్ట బందోబస్తు : సీపీ

సిద్దిపేటకల్చరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : రేపు జరిగే జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలులో ఉంటుందని సీపీ అనురాధ తెలిపారు. ఈ నెల 8న జిల్లాలోని 10 కేంద్రాల వద్ద 9వ, 11వ తరగతి ప్రవేశాలకు పరీక్ష జరగుతుందన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 500 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడవద్దని, కేంద్రాలకు సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని సూచించారు. పోలీసులు ప్రత్యేకంగా పెట్రోలింగ్ చేపట్టడంతో పాటుగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గంట ముందుగా విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

తాగి బండి నడిపితే జైలుకే!

- జిల్లాలో రోజు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు
- నెల రోజుల్లో 1,385 కేసులు
- 15 మందికి జైలు శిక్ష

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోలీసులు ప్రతీ రోజు సాయంత్రం డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టి మందుబాబుల ఆగడాలకు అడ్డుకట్ట వేస్తున్నారు. జిల్లాలో ఉన్న ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు, సిద్దిపేట జిల్లా కేంద్రంలో, గజ్వేల్‌లో ట్రాఫిక్ పోలీసులు నిత్యం తనిఖీ చేపడుతున్నారు. 35 ఎంజీ దాటితే మద్యం సేవించినట్లుగా నిర్ధారణ చేసి కేసులు నమోదు చేస్తున్నారు. మద్యం సేవించిన వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల జరిగే అనర్థాల గురించి ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.



జరిమానాతో పాటు జైలు

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వారిని కొద్దిరోజులకు కోర్టుకు పంపించి మెజిస్ట్రేట్ ముందు హాజరుపరుస్తారు. విచారణ జరిపిన తర్వాత మద్యం సేవించిన వాహన దారులకు జరిమానా విధిస్తున్నారు. ఎక్కువగా మద్యం సేవించిన వారికి, రెండోసారి డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వారికి జరిమానాతో పాటు జైలు శిక్ష విధిస్తున్నారు. గడిచిన జనవరిలో జిల్లా మొత్తంలో పోలీసులు 1,385 కేసులు నమోదు చేసి కోర్టు ద్వారా జరిమానా విధించారు. వీరిలో 15 మందికి జరిమానా తో పాటు జైలు శిక్ష పడింది.

మద్యం సేవించి వాహనం నడిపితే చర్యలు

రోడ్డు ప్రమాదాలను నివారించడానికి జిల్లా మొత్తంలో ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో నిత్యం డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్నాం. మద్యం సేవించినట్లు రుజువైతే ఆ వాహనదారులకు జరిమానాతో పాటు జైలు శిక్ష విధిస్తున్నాం. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్లనే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, అనవసరంగా మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దు.

- బి.అనురాధ, సీపీ

సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి

- డీఎంహెచ్‌వో పల్వన్‌కుమార్

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాసుపత్రుల్లో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ పల్వన్‌కుమార్ సూచించారు. జగదేవ్‌పూర్, తిగుల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రులను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి అంతా కలియ తిరుగుతూ.. రోజువారి రోగుల సంఖ్యను, అలాగే రక్త నమూనాల సేకరణ, ఫార్మసీ కేంద్రాన్ని పరిశీలించారు. జగదేవ్‌పూర్ ఆసుపత్రి సాధారణ ప్రసవాల్లో ముందుందని, తిగుల్ ఆసుపత్రి సేవలు బాగున్నాయన్నారు. మరింత ప్రోత్సహించాలని సూచించారు. ఆస్పత్రి సిబ్బంది పని తీరు రోజువారీ రోగుల సంఖ్య కూడా బాగుందన్నారు. ఫార్మసిస్టు పోస్టు ఖాళీ ఉన్నందున త్వరలోనే భర్తీ చేస్తామని తెలిపారు. ఆయనతో పాటు డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, సీహెచ్‌వో రవీందర్‌రెడ్డి, శ్రీమతి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సత్యప్రకాష్, వైద్య సిబ్బంది జితేందర్‌రెడ్డి, సురేష్, మంగ ఉన్నారు.



ఆసుపత్రి రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

నియోజకవర్గంలో బీటీ రోడ్లు,
డ్రైనేజీల నిర్మాణానికి రూ. 44.38 కోట్లు

- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ నియోజకవర్గంలో బీటీ రోడ్లు, సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.44.38 కోట్ల నిధులు మంజూరైనట్లు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అక్కన్నపేట మండలంలో బీటీ రోడ్ల నిర్మాణాలకు రూ. 4.35 కోట్లు, భీమదేవరపల్లి మండలానికి రూ. 6కోట్లు, కోహెడ మండలానికి రూ. 1.95కోట్లు, సైదాపూర్ మండలానికి రూ. 2.70 కోట్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి రూ.11.49 కోట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఇందులో సైదాపూర్ మండలానికి రూ.2కోట్లు, చిగురుమామిడి మండలానికి రూ. 1.8 కోట్లు, హుస్నాబాద్ మండలానికి రూ. 1.5 కోట్లు, అక్కన్నపేట మండలానికి రూ.2.9 కోట్లు, ఎల్కతుర్తి మండలానికి రూ.1.40 కోట్లు, భీమదేవరపల్లి మండలానికి రూ.1.40 కోట్లు, బీటీ రోడ్ల రెన్యూవల్‌కు రూ.17.89 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఈ నిధులు మంజూరుకావడంపై నియోజకవర్గ ప్రజలు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

జీటీఎన్ ఇంజనీరింగ్ లిమిటెడ్
ఖాతాలోని నగదు జప్తు

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి కాలుష్యానికి కారణమైన జీటీఎన్(ఇండియా) లిమిటెడ్ బ్యాంకు ఖాతాలోని రూ. 51.24 లక్షల్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు జప్తు చేశారు. సంగారెడ్డి జిల్లాలోని జీటీఎన్ ఇంజనీరింగ్ లిమిటెడ్ (పర్‌ఫెక్ట్ నిట్టర్స్) పరిశ్రమ నుంచి వెలువడే వ్యర్థాల్ని శుద్ధి చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించింది. వ్యర్థాల్ని శుద్ధి చేసేందుకు ఏర్పాటు చేసిన ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఈటీపీ)ను సక్రమంగా వినియోగించ లేదు. ప్లాంట్‌ను సక్రమంగా వినియోగించకుండా వ్యర్థాల శుద్ధికి వినియోగించాల్సిన రూ.51.24 లక్షలు మిగిలించుకున్నారు. శుద్ధి చేయని వ్యర్థాలను బయటకు వదలడంతో పరిసర ప్రాంతాల్లో నీరు, వాతావరణం కలుషితమైంది. ఈ విషయాన్ని గ్రహించిన కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) సంగారెడ్డి జిల్లా అడిషనల్ జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో గతంలో కేసు ఫైల్ చేసింది. పీసీబీ నమోదు చేసిన కేసు ఆధారంగా ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్(పీఎంఎల్) యాక్ట్ 2002 కింద ఈడీ కేసు నమోదు చేసి విచారణ చేపట్టింది. ప్లాంట్ నిర్వహణకు ఖర్చు చేయకుండా దారి మళ్లించి బ్యాంకు ఖాతాలో ఉంచిన రూ.51.24 లక్షలు జప్తు చేసినట్లు ఈడీ హైదరాబాద్ జోనల్ అధికారులు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి

- కలెక్టర్ మనుచౌదరి

కొండపాక, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ గురుకుల హాస్టళ్లలో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందివ్వాలని కలెక్టర్ మను చౌదరి పేర్కొన్నారు. కొండపాక మండలం దుద్దెడ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూలు, కొండపాకలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, కొండపాకలోని వెనుకబడిన తరగతుల బాలికల హాస్టల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలల్లో భోజనం, విద్యా వసతులు తదితర అంశాలను పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కామన్ మెనూ ప్రకారం విద్యార్థులకు అందుతున్న తీరును పరిశీలించారు. ఇంటర్ విద్యార్థులతో మాట్లాడుతూ.. వార్షిక పరీక్షల ప్రిపరేషన్‌పై ఆరాతీశారు. మార్చి 6 నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ఉన్నందున వంద శాతం ఉత్తీర్ణత సాధించాలంటే ప్రతీ సబ్జెక్టును రిపీట్‌గా చదవాలని విద్యార్థులు సూచించారు. పరీక్షలు బాగా రాసేలా స్లిప్ టెస్టులు ఎక్కువగా పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. దుద్దెడ గురుకుల పాఠశాలలో వంటగది, హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని ఆకుకూరలు అధికంగా ఉండేలా మెనూ ప్రకారం ఆహారం అందించాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కృష్ణను ఆదేశించారు. కాలం చెల్లిన సరుకులను వాడకూడదని తెలిపారు. పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ దిలీప్‌కుమార్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఆర్ఐ బాల కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.



కొండపాకలోని వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో కూరగాయలను పరిశీలిస్తున్న కలెక్టర్



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

పంటలు ఎండిపోతున్నాయి..

- చెరువులు నింపాలంటూ రైతుల ధర్నా



రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న రైతులు

సిద్దిపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తమ పంట పొలాలు ఎండిపోతున్నాయని ముబారస్పూర్, మల్లేశంపల్లి, హైమద్‌నగర్ గ్రామస్థుల రైతులు ఎమ్మెల్యే, ఎంపీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. కొండపోచమ్మ కాలువ ద్వారా చెరువులు నింపకపోవడంతో తమ పొలాలు ఎండిపోతున్నాయని గురువారం ఆయా గ్రామాల రైతులు దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ రఘునందన్‌రావు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. నాయకులు, అధికారులు స్పందించి కొండపోచమ్మ ద్వారా చెరువులు నింపాలని కోరారు. లేదంటే అన్ని గ్రామాల ప్రజలు కలిసి పెద్దఎత్తున ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్, ఇరిగేషన్ అధికారులు రైతుల వద్దకు చేరుకుని రెండు, మూడు రోజుల్లో కాలువల ద్వారా చెరువులు నింపే ప్రయత్నం చేస్తామని, సమస్యను పరిష్కరిస్తామని చెప్పడంతో రైతులు ధర్నా విరమించారు.

అడ్వాన్స్ గిఫ్ట్ అందింది

- హరీశ్‌రావు సొంత ఖర్చుతో డిజిటల్ కంటెంట్ బుక్స్ పంపిణీ
- 2500 మంది పదోతరగతి విద్యార్థులకు అందజేత

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : పదోతరగతి విద్యార్థులకు మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఇస్తానని చెప్పిన డిజిటల్ కంటెంట్ బుక్స్ విద్యార్థులకు చేరాయి. హరీశ్‌రావు సొంత ఖర్చుతో నియోజకవర్గంలోని 2500 మంది విద్యార్థులకు డిజిటల్ కంటెంట్ బుక్స్‌ను విద్యార్థులకు ఇళ్లకు పంపించారు. మూడేళ్లుగా హరీశ్‌రావు ఈడిజిటల్ కంటెట్ బుక్స్‌ను అందిస్తున్నారు. ఇప్పటి వరకు దాదాపు 10వేలకు పైగా విద్యార్థులకు అన్నిరకాల సబ్జెక్టులకు సంబంధించిన డిజిటల్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఇక డిజిటల్ కంటెంట్ బుక్స్‌ను అందుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.



డిజిటల్ కంటెంట్ బుక్‌తో సబ్జెక్ట్ సాధన చేస్తున్న విద్యార్థి



డిజిటల్ కంటెంట్ బుక్స్‌తో విద్యార్థులు

డిజిటల్ కంటెంట్ బుక్స్ అంటే ..?

పాఠ్యాంశాల ఆధారంగా, వివిధ అంశాల వారీగా బుక్స్‌లో సమాచారం ఉంటుంది. వాటికి ఎదురుగా క్యూఆర్‌కోడ్స్ ఉంటాయి. వాటిని ట్యాబ్ ద్వారా కానీ, సెల్‌ఫోన్ ద్వారా కానీ స్కాన్ చేయాలి. వెంటనే మొబైల్, ట్యాబ్ స్క్రీన్‌పై సబ్జెక్టులకు సంబంధించిన వాయిస్, వీడియో ఫైల్స్ ఓపెన్ అవుతాయి. ఆయా సబ్జెక్టులకు సంబంధించిన వీడియో పాఠాలు ప్రత్యక్షమవుతాయి. వీటి ద్వారా సులభంగా వినవచ్చు అలాగే చూడొచ్చు. పాఠాలు చదివే సమయంలో క్లాసులో అనుమానం వస్తే టీచర్ క్లియర్ చేస్తారు. ఇంటి వద్ద చదువుకునే సమయంలో సమస్య వస్తే ఈ డిజిటల్ క్యూఆర్ కోడ్ ద్వారా వచ్చే వీడియో, ఆడియో ద్వారా నివృత్తి చేసుకునే అవకాశం ఉంటుంది. కొత్త వస్తువు ఏదైనా విద్యార్థికి నూతన ఉత్సాహనిస్తుందని, పరీక్షలకు మంచిగా ఉపయోగపడుతుందని విద్యావేత్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



పనులు సరే.. ప్రమాద సూచిక బోర్డులేవి?

మండల కేంద్రమైన సిర్గాపూర్ నుంచి నారాయణఖేడ్ వరకు నిర్మిస్తున్న డబుల్ లేన్ రహదారి పనుల్లో భాగంగా నడుము లోతు వరకు తవ్వారు. కానీ ప్రమాద సూచికలు ఏర్పాటు చేయలేదు. దీంతో రాత్రివేళల్లో ఇటువైపు నుంచి వెళ్లే వాహనదారులకు గుంతలు కనిపించక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా.. వెంటనే సూచికబోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

- కల్హేర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి)



మల్కాపూర్ రైతు వేదిక ఆవరణలో కోనోకార్పస్ చెట్లు



మునిదేవునిపల్లి వెంచర్‌లో పెంచుతున్న కోనోకార్పస్ మొక్కలు

పక్షి వాలని మొక్క.. పెరుగుతోంది ఎంచక్కా!

ఊరూరా ప్రాణాంతక కోనోకార్పస్ మొక్కలు

కొండాపూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణానికి హాని కలిగించే ప్రాణాంతకమైన కోనోకార్పస్ మొక్కలు గ్రామాల చుట్టూ విస్తరించాయి. హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల ఆవరణ, రోడ్లకు ఇరువైపులా, ప్రకృతి వనాలలో ఈ మొక్కలను విరివిగా నాటారు. అవి ఏపుగా పెరగడంతో పచ్చదనం సంతరించుకున్నది. ఈ మొక్కలు పచ్చదనంతో ఆహ్లాదాన్ని పంచడం అటుంచితే చిన్నచిన్న జీవరాసుల ఆయువును తీస్తాయని, మానవులకు శ్వాసకోశ సమస్యలను తీసుకొస్తుందని వృక్ష శాస్త్రవేత్తలే చెబుతున్నారు. ఇవి వెదజల్లే పుప్పొడి, వ్యాపించే సువాసనతో దుష్పరిణామాలు ఉంటాయని, అందుకే పక్షులు, సీతాకోకచిలుకలు, కీటకాలు వాలవని తెలిపారు. దీంతో ఈ చెట్లను తొలగించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసినా, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

కోనోకార్పస్ మొక్కలు తక్కువ కాలంలో ఏపుగా పెరగడం, ప్రతి రుతువులోనూ పచ్చదనంతో కళకళలాడుతుంది. వారాల వ్యవధిలోనే ఎదగడంతో గతంలో హరితహారం కార్యక్రమంలో ఈ మొక్కలనే ఎక్కువగా నాటారు. గ్రామాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో, వెంచర్లు, ఖాళీ స్థలాల్లో వీటిని నాటించింది. పల్లెలు, పట్టణాలకు రోడ్లకు ఇరువైపులా ఎక్కువగా ఈ మొక్కలనే నాటారు. వీటి వేర్లు భూమిలో పాతుకుపోతూ మధ్యలో అడ్డువస్తున్న కేబుళ్లు, డ్రైయినేజీ, తాగునీటి పైపులైన్ల సరఫరా వ్యవస్థను ధ్వంసం చేస్తున్నది. దీని దుష్పరిణామాలను గుర్తించి వీటిని హరితహారం ద్వారా నాటొద్దని, ఉన్న వాటిని తొలగించాలని అధికారులను ఆదేశించారు. అయితే, క్షేత్రస్థాయిలో ఈ ఆదేశాలు అమలుకు నోచుకోవడం లేదని తెలుస్తున్నది.

ఉద్యాన పంటల సాగుతో లాభదాయకం

● సంగారెడ్డి జిల్లా ఉద్యానశాఖ అధికారి సోమేశ్వరరావు



మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారి సోమేశ్వరరావు

జహీరాబాద్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి) : ఉద్యానపంటల సాగు రైతులకు లాభదాయకంగా ఉంటుందని సంగారెడ్డి జిల్లా ఉద్యానశాఖ అధికారి సోమేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివప్రసాద్‌లు పేర్కొన్నారు. గురువారం మండలంలోని మధులైతండాలో ఉద్యానపంటల సాగుపై పలువురు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని వ్యసాయ భూములు అన్ని పంటల సాగుకు యోగ్యమైనవన్నారు. రైతులు అధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. భూసార పరీక్షలను చేయించుకోవాలని సూచించారు. పంటల సాగులో మెలకువలు పాటిస్తే ఆశించిన దిగుబడులను సాధించవచ్చన్నారు. ఆయిల్‌ఫామ్ పంటల సాగుపై రైతులు అమితాసక్తిని చూయిస్తున్నారని తెలిపారు. అందుకు అవసరమైన మొక్కలు, తదితరాలను ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో అందజేస్తామన్నారు. ప్రభుత్వం రాయితీ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. రైతులు రసాయన ఎరువులకు స్వస్తి పలికి, సేంద్రియ ఎరువులను వినియోగం పెంచాలన్నారు. ఉద్యాన, వ్యవసాయ శాఖలు ఎల్లప్పుడూ రైతులకు వెన్నుదన్నుగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త శైలజ, ఉద్యానశాఖ అధికారి పండరి, రైతులు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఈ ప్రాంతంలో సాగవుతున్న మామిడి తోటలను వారు రైతులతో కలిసి పరిశీలించారు.

ఫైనాన్స్ వేధింపులు తాళలేక ఒకరి ఆత్మహత్య



సత్యనారాయణ (ఫైల్)

దౌల్తాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేట్ ఫైనాన్స్‌లో అప్పు తీసుకొని తీర్చే మార్గంలేక, వారి ఒత్తిడి భరించలేక ఒకరు ఉరేసుకొని మృతి చెందిన సంఘటన దౌల్తాబాద్‌లో గురువారం సాయంత్రం చోటు చేసుకున్నది. బంధువులు, దౌల్తాబాద్ ఎస్‌ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన తుమ్మల సత్యనారాయణ(41) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. కుటుంబ అవసరాల నిమిత్తం మూడేళ్లక్రితం సిద్దిపేటలోని ఐఐఎఫ్‌సీ ప్రైవేట్ ఫైనాన్స్‌లో రూ.16 లక్షలు అప్పు తీసుకున్నాడు. ఇందుకోసం ఇంటిని తనఖా పెట్టాడు. ఇందుకు ప్రతీ నెల రూ.22 వేల ఈఎంఈ రెండేళ్ల పాటు క్రమం తప్పకుండా కట్టాడు. ఏడాదిగా ఈఎంఐ కట్టలేకపోయాడు. ఫైనాన్స్ రికవరీ వాళ్లు ఇటీవల ఇంటికి వచ్చి అప్పు కట్టాలని, లేదంటే ఇంటిని జప్తు చేస్తామని నోటీసులు ఇచ్చారు. దీంతో మనస్తాపానికి గురైన సత్యనారాయణ బుధవారం అత్తగారి ఇల్లు అయిన కొనాపూర్‌కు వెళ్లాడు. అక్కడ భార్య రేణుకతో రాత్రి 9 గంటల ప్రాంతంలో అప్పు విషయంలో గొడవ జరిగింది. ఫైనాన్స్ కంపెనీ ఒత్తిళ్లు, ఇంట్లో గొడవల నేపథ్యంలో గురువారం ఉదయం బావమరిది పొలం వద్దకు వెళ్లిన సత్యనారాయణ అక్కడ చెట్టుకు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఫైనాన్స్ కంపెనీ ఒత్తిడి వల్లే తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని అతని భార్య రేణుక ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో మరొకరు..



దార నాగరాజు (ఫైల్)

గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల పరిధిలోని అనంతరావుపల్లిలో గురువారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దార నాగరాజు(42)కు భార్య నాగమణితో పాటు ఇద్దరు కుమారులు, తల్లి పెంటవ్వ ఉన్నారు. నాగరాజు తనకున్న 10 గుంటల భూమిలో వ్యవసాయం, కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఐదు సంవత్సరాల క్రితం తెలిసిన వాళ్ల దగ్గర ఇల్లు కట్టుకోవడానికి అప్పు చేశాడు. ఆర్థిక ఇబ్బందులతో మద్యానికి బానిసై మూడేళ్ల క్రితం ఉరేసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. సంవత్సరం క్రితం చెరువులో దూకి, ఆరునెలల క్రితం మరోసారి ఉరేసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. బుధవారం రాత్రి 9 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతుకుతూ పొలం వద్దకు వెళ్లి చూసేసరికి చెట్టుకు ఉరేసుకొని కనిపించాడు. మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

క్రైం కార్నర్

కుంభమేళాకు వెళ్లి.. రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


రవీందర్‌యాదవ్ (ఫైల్)

మనోహరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కుంభమేళాకు వెళ్లి ఒకరు రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సంఘటన మనోహరాబాద్ మండల పరిధిలో బుధవారం రాత్రి చోటుచేసుకున్నది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కూచారం గ్రామ పరిధి డిల్లాయికి చెందిన మెరుడు రవీందర్‌యాదవ్(43) తన కుటుంబసభ్యులు, బావమరిది కుటుంబసభ్యులతో కలసి ఉత్తర్‌ప్రదేశ్‌లో జరుగుతున్న కుంభమేళాకు కారులో వెళ్లారు. కుంభమేళాలో పుణ్యస్నానం ఆచరించి, ప్రయాగ్‌రాజ్ నుంచి అయోధ్యకు వెళుతుండగా బుధవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కారులో ముందున్న రవీందర్ అక్కడికక్కడే మృతిచెందగా, అతని బావమరిది ఐదేండ్ల కుమారుడికి ఎడమ చేయి విరిగింది. ఈ ఘటనలో మిగతా వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కాగా రవీందర్‌యాదవ్ ఓ ప్రైవేట్ పరిశ్రమలో పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతనికి భార్య సుమలత, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

బైక్ అదుపు తప్పి యువకుడు..


మహేష్ మృతదేహం

రాయపోల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): బైక్ అదుపు తప్పి కింద పడడంతో యువకుడు మృతి చెందిన సంఘటన రాయపోల్ మండలం కొత్తపల్లి గ్రామంలో చోటుచేసుకున్నది. ఎస్ఐ రఘుపతి, బాధిత కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. కొత్తపల్లి గ్రామానికి చెందిన పంగ మహేష్(32) వ్యవసాయ పనుల నిమిత్తం గురువారం పొలం వద్దకు బైక్‌పై వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. దీంతో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 అంబులెన్స్‌లో గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. ఈ మేరకు మృతుని భార్య నాగమణి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మంజీర నదిలో మునిగి ఒకరు..


మహమ్మద్ మౌలానా మృతదేహం

పుల్‌కల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మంజీర నదిలో మునిగి ఒకరు మృతిచెందిన సంఘటన గురువారం జరిగింది. పుల్కల్ ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని ప్రగతినగర్ కాలనీకి చెందిన మహమ్మద్ మౌలానా (60) గురువారం ఉదయం సింగూరు ప్రాజెక్టును చూసేందుకు వచ్చారు. ప్రాజెక్టు పరిసరాలను చూసిన అనంతరం స్నానం చేసేందుకని ప్రాజెక్టు దిగువ భాగంలో మంజీర నదిలోకి దిగారు. ప్రమాదవశాత్తు నీటిలో మునిగి ఊపిరాడక మృత్యువాత పడ్డాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మౌలానాకు భార్య, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ క్రాంతికుమార్ పాటిల్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంట్లో కుళ్లిపోయిన మృతదేహం గుర్తింపు


వడియారం మల్లేశ్(ఫైల్)

తూప్రాన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో మద్యానికి బానిసై ఒంటరిగా ఉంటున్నాడు. ఎప్పుడు చనిపోయాడో, ఎలా చనిపోయాడో తెలియదు. స్థానికులకు ఆ ఇంట్లో నుంచి దుర్వాసన రాగా పోలీసులతో కలిసి చూడగా కుళ్లిపోయిన స్థితిలో మృతదేహన్ని గుర్తించారు. ఈ సంఘటన తూప్రాన్ పట్టణంలోని ఎస్సీ కాలనీలో గురువారం చోటు చేసుకున్నది. తూప్రాన్ ఎస్ఐ శివానందం కథనం ప్రకారం.. తూప్రాన్ పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన వడియారం మల్లేశ్(48), భార్య జ్యోతికి మధ్య కలహాలతో ఆమె రెండేళ్లుగా కొడుకుతో వేరుగా ఉంటుంది. ఇంట్లో ఒంటరిగా ఉంటూ మల్లేశ్ మద్యానికి బానిసయ్యాడు. వారం, పదిరోజుల క్రితం ఇంట్లో మృతిచెందాడు. ఒక్కడే ఉంటుండటంతో ఎవరూ గుర్తించలేదు. గురువారం ఇంట్లోంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి పరిశీలించగా, కుళ్లిపోయిన స్థితిలో మల్లేశ్ మృతదేహం గుర్తించారు. భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం వివరించారు.

తిమ్మాయిపల్లిలో అస్థిపంజరం లభ్యం

హవేళిఘణపూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మాయిపల్లి గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో తగులబెట్టిన స్థితిలో ఉన్న అస్థిపంజరం లభ్యమైందని ఎస్ఐ సత్యనారాయణ గురువారం తెలిపారు. సంఘటన స్థలంలో సగం కాలిన తల, అస్థిపంజరం వేర్వేరుగా పడిఉన్నాయి. ఆ అస్థిపంజరం ఆడ లేదా మగ ఎవరిదో గుర్తు పట్టలేని విధంగా కాలిపోయి ఉన్నాయి.

శవయాత్రపై తేనెటీగల దాడి

- 40 మందికి గాయాలు.. 9 మందికి తీవ్ర అస్వస్థత
- ఒకరి పరిస్థితి విషమం



నంగునూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అందిస్తున్న సిబ్బంది, తీవ్రంగా గాయపడిన మహిళను సిద్దిపేటకు తరలిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

నంగునూరు, ఫిబ్రవరి 6 : శవయాత్రపై తేనెటీగలు దాడి చేసిన సంఘటన నంగునూరులో గురువారం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి ముత్యాల రాజయ్య(70) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. అంత్యక్రియలను గురువారం నిర్వహించారు. నంగునూరులోని ఇంటి దగ్గర నుంచి శ్మశానవాటికకు శవయాత్ర వెళ్తున్న సమయంలో గ్రామ శివారులోని చింతచెట్టు వద్దకు వెళ్లగానే ఒక్కసారిగా తేనెటీగలు లేచాయి. శవయాత్రలో వెళ్తున్న వారిపై దాడి చేశాయి. ఈ దాడిలో మృతుని భార్య ఎల్లవ్వతోపాటు సుమారు 40 మంది గాయపడ్డారు. వారిని వెంటనే 108 అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. తీవ్ర అస్వస్థకు గురైన మృతుని భార్య ఎల్లవ్వ, మరో ఏడుగురు రాకేష్(25), రాజెల్లయ్య(70), చంద్రయ్య(65), భాగ్యలక్ష్మి(48), లింగయ్య(69), మంజుల(38), ఉప్పలవ్వ(55)తో పాటు మరికొంత మందిని మెరుగైన వైద్యం కోసం సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి(జీజీహెచ్)కు తరలించారు. ఈ తేనెటీగల దాడిలో రాజెల్లయ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.



అమెరికాలో సేఫేనా?

- ఉమ్మడి జిల్లా నుంచి వందల్లో విద్యార్థులు
- ఉన్నత చదువు కోసం వెళ్లి ఉద్యోగం చేస్తున్న వారిపై కొరడా
- డిపోర్టేషన్ భయం గుప్పిట్లో విద్యార్థులు
- పార్ట్‌టైమ్ ఉద్యోగం చేయకుండా అక్కడుండటం కష్టతరమే
- ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : డాలర్ డ్రీమ్స్‌తో యువత ఎంతోమంది అగ్రదేశమైన అమెరికాకు వెళ్లి స్థిరపడాలని కష్టపడుతుంటారు. ఉన్నత చదువుల కోసం, ఉద్యోగాల నిమిత్తం అక్కడికి వెళుతున్న విద్యార్థుల ఆశలను అమెరికా ప్రభుత్వం నీరుగార్చుతుంది. ఎన్నికల వాగ్దానాల అమలుకు ఉపక్రమించిన అమెరికా నూతన అధ్యక్షుడు ప్రస్తుతం చేతల్లోకి దిగారు. సరైన పత్రాలు లేకుండా అమెరికాలో ఉంటున్న భారతదేశానికి చెందిన వలసదారులను తొలి విడతగా వెనక్కి పంపించారు. గురువారం అమెరికా నుంచి వచ్చిన సైనిక విమానంలో రాష్ట్రానికి చెందిన విద్యార్థులు ఎవరూ లేనప్పటికీ అమెరికాలో చదువు నిమిత్తం వెళ్లిన వారిలో ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన పలువురు విద్యార్థుల తల్లిదండ్రుల్లో టెన్షన్ మొదలైంది. ఉమ్మడి జిల్లా నుంచి అమెరికాకు వెళ్లిన కొందరు ఎక్కడ తాము దొరికిపోతామోనని డిపోర్టేషన్ (ఆ ప్రాంతం నుంచి స్వదేశానికి పంపడం) భయం గుప్పిట్లో ఉన్నట్లు తెలిసింది. ఎఫ్1, హెచ్1 వీసాలపై మరిన్ని ఆంక్షలు విధించాలన్న ఆలోచనలో ట్రంప్ ప్రభుత్వం ఉండడంతో, ఇకపై అమెరికాకు వెళ్లాలనుకునే విద్యార్థులకు మరింత కష్టతరం కానున్నది.

పార్ట్‌టైమ్ ఉద్యోగంపై కలవరం

అమెరికాలో ఉన్నత చదువులు చదివి అక్కడే ఉద్యోగం పొంది స్థిరపడాలనుకున్న యువతకు ఇటీవల పరిణామాలు కొంత ఇబ్బందికరంగా మారుతున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి అమెరికాలో ఉన్నత చదువుల కోసం వందల సంఖ్యల్లోనే తరలివెళ్లారు. అక్కడికెళ్లిన చాలా మంది ఆర్థిక సమస్యలతో పార్ట్‌టైమ్ ఉద్యోగంపైనే ఆధారపడిన వారు ఉన్నారు. అక్కడ ఇంత వరకు బాగానే ఉన్నా ట్రంప్ తీసుకున్న నిర్ణయంతో పార్ట్‌టైమ్ చేస్తున్న పలువురు విద్యార్థులకు కష్టాలు తప్పేలా లేవు. పార్ట్‌టైమ్ ఉద్యోగం లేకున్నా పర్వాలేదు కానీ, స్వదేశానికి మధ్యలోనే పంపిస్తే తమ జీవితాలు నాశనమవుతాయని ఆవేదన చెందుతున్నారని తల్లిదండ్రులు తెలుపుతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందో, సైనికులకు ఏ విద్యార్థి ఎప్పుడు సరైన పత్రాలు లేకుండా కంటపడుతాడోనని భయం గుప్పిట్లో విద్యార్థులు ఉండగా, వారి తల్లిదండ్రులూ ఇక్కడ తల్లడిల్లుతున్నారు.

కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలి

అమెరికా ట్రంప్ ప్రభుత్వం ఇలా చేయడం దారుణమని పలువురు విద్యార్థుల కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకుని తమ పిల్లలను సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. తమ పిల్లలకు ఎదైనా జరిగితే పూర్తి బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే వహించాలని హెచ్చరిస్తున్నారు. ఇతర దేశాలకు చెందిన వారు మన దేశంలో నివసించడం లేదా అని ప్రశ్నిస్తున్నారు.

అమెరికాది అమానవీయ చర్య



అమెరికా దేశం కేవలం వలస వచ్చిన వారితో నిర్మితమైన దేశం. కష్టానికి ప్రతిరూపమైన భారతీయులు ఎందరో తమ విజ్ఞానంతో ఎదిగి ఈరోజు అమెరికా కంపెనీలైన మైక్రోసాఫ్ట్, గూగుల్ మొదలగు సంస్థలకు సీఈవోలుగా రాణిస్తున్నారు. అమెరికా అంటే ఐటీ, ఐటీ అంటే భారతీయులు అన్నంతగా పెనవేసుకున్నారు. కానీ భారతీయులకు ఎలాంటి హెచ్చరికలు, సమయం ఇవ్వకుండా తరలించడం అనేది మానవ హక్కుల ఉల్లంఘనే అవుతుంది. ఎంతోమంది భారతీయులు విద్యార్థులు ఆర్థిక, మానసిక వేదనకు గురయ్యే అమానవీయ చర్య ఇది. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలి. సమయం వృథా చేయవద్దు.

\- పిన్న రాములు, ప్రముఖ న్యాయవాది, సిద్దిపేట

ఉపాధిహామీ పనుల్లో మృతిచెందితే రూ.25 లక్షల నష్టపరిహారం చెల్లించాలి

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

అక్కనపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనుల్లో మృతి చెందిన కుటుంబాలకు రూ.25 లక్షలు, గాయపడిన వారికి రూ.15 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం అక్కన్నపేట మండలం గోవర్ధనగిరిలో మృతుల కుటుంబసభ్యులతో పాటు గాయపడిన వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పనుల్లో అధికారుల నిర్లక్ష్యం కారణంగానే సంఘటన జరిగినట్లు స్పష్టంగా కనిపిస్తుందని, ప్రమాదానికి కారణమైన అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నామమాత్రంగా ఫీల్డ్ అసిస్టెంట్‌పై నెపం మోపి అతని ఒక్కడిపైనే జిల్లా అధికారులు చర్యలు తీసుకుని చేతులు దులుపుకోవడం సరికాదని ఆరోపించారు. వెంటనే మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి మృతుల కుటుంబాలకు నష్టపరిహారంతోపాటు వారిలో అర్హులైన వారికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. ఆయన వెంట సీపీఐ మండల కార్యదర్శులు కొమ్ముల భాస్కర్, గడిపే మల్లేష్, నాయకులు జాగీరు సత్యనారాయణ, కొయ్యడ కొమురయ్య, ఎడల వనేష్, ఎగ్గోజు సుదర్శనచారి తదితరులు ఉన్నారు.

గౌరవెల్లి ప్రాజెక్టు వద్ద సీసీ కెమెరా మాయం


గౌరవెల్లి ప్రాజెక్టు వద్ద చోరీకి గురైన సీసీ కెమెరా

అక్కన్నపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గౌరవెల్లి ప్రాజెక్టు వద్ద అమర్చిన సీసీ కెమెరాలు మాయమవుతున్నాయి. గుడాటిపల్లి వద్ద నిర్మించిన గౌరవెల్లి ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు లేకుండా ప్రాజెక్టు పనులు చేస్తున్నారని పలువురు రైతులు జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ)ని ఆశ్రయించగా, ప్రాజెక్టు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎన్జీటీ ఆదేశాలు జారీ చేసింది. దీంతో 2023 సెప్టెంబరు 23న గోదావరి పర్యావరణ బోర్డు అధికారులు గౌరవెల్లి ప్రాజెక్టు వద్ద సోలార్ సిస్టంతో నడిచే దాదాపు 12 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సీసీ కెమెరాల్లో రికార్డు ఆయన దృశ్యాలను హైదరాబాద్‌లోని గోదావరి పర్యావరణ బోర్డు కార్యాలయంలో కనిపించేలా అనుసంధానం చేశారు. కానీ వారం రోజుల క్రితం ఒక సీసీ కెమెరాను ఎత్తుకెళ్లారు. గతంలో రెండు సీసీ కెమెరాలను ఎత్తుకెళ్లడంతో అధికారులు మళ్లీ అమర్చారు.


భీమ్లా తండా నీలగిరి ప్లాంటేషన్‌లో నరికివేసిన చెట్లు

200 నీలగిరి చెట్లపై గొడ్డలివేటు

శివ్వంపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : శివ్వంపేట మండలం భీమ్లా తండాలోని నీలగిరి ప్లాంటేషన్‌లో 200 చెట్లను గుర్తుతెలియని దుండగులు నరికివేశారు. నీలగిరి కలపకు మంచి డిమాండ్ ఉండడంతో తూప్రాన్ రేంజ్ పరిధిలోని వెల్దుర్తి మండలం మంగలపర్తి సెక్షన్ శివ్వంపేట మండలం భీమ్లాతండాలో నీలగిరి ప్లాంటేషన్‌లో సుమారు రెండు వందలకుపైగా నీలగిరి చెట్లను చార్జింగ్ యంత్రాల సహాయంతో రాత్రి సమయంలో కోసివేసి డీసీఎంలో తరలించి విక్రయించినట్లు తెలిసింది. తూప్రాన్ ఎఫ్ఆర్వో అంబర్‌సింగ్‌ను ఈ విషయమై సెక్షన్ ఆఫీసర్ కిరణ్‌తో పాటు సిబ్బందిని పంపించి విచారణ చేయించామని, అక్రమార్కులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.


కోతకు గురైన చెట్లను పరిశీలిస్తున్న సెక్షన్ ఆఫీసర్ కిరణ్, సిబ్బంది

బీసీ కులగణన చరిత్రాత్మకం

- బీసీలంతా సీఎం రేవంత్‌రెడ్డికి రుణపడి ఉంటాం
- కాంగ్రెస్ నాయకుడు నీలం మధుముదిరాజ్
- సీఎం రేవంత్‌రెడ్డికి కలిసి కృతజ్ఞతలు తెలిపిన మధు


సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నీలం మధుముదిరాజ్

పటాన్‌చెరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): దేశంలో ఎక్కడా లేని విధంగా బీసీ కులగణన చేపట్టి, భవిష్యత్ రాజకీయ భరోసా కల్పించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికి దక్కుతుందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ నాయకుడు నీలం మధుముదిరాజ్ అన్నారు. సమర్థవంతంగా బీసీ కులగణన పూర్తి చేసినందుకు బీసీల తరఫున గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా దామాషాలో బీసీలకు సరైన రాజకీయ ప్రాధాన్యం లభించడం లేదన్నారు. అధికారికంగా గణాంకాలను ప్రకటించడంతో బీసీలకు ఎంతో మేలు జరిగిందన్నారు. అవకాశాలు ఉన్నా బీసీలకు సరైన న్యాయం జరగలేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు బీసీ కులగణన చేపడతామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఇచ్చిన మాటను సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేసి చూపించారన్నారు. బీసీ కులగణనతో చట్టసభల్లో బీసీ నాయకుల ప్రాబల్యం గణనీయంగా పెరుగుతుందన్నారు. గణాంకాల వెల్లడితో బీసీల పట్ల అన్ని పార్టీల వైఖరి మారుతుందనడంలో సందేహం లేదన్నారు. బీసీలకు సీఎం రేవంత్‌రెడ్డి చేసిన భారీ సహాయానికి రుణపడి ఉంటామన్నారు. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడం కేవలం కాంగ్రెస్ ప్రభుత్వానికే సాధ్యమైందన్నారు. దీంతో బీసీ కులాలకు అపారమైన అవకాశాలు లభిస్తాయన్నారు.

కార్మికుల కడుపుకొట్టిన యంత్రం

- నాడు ఇసుక కూలీలకు కేరాఫ్‌గా మంగల్‌పేట్
- నేడు పనుల్లేక బేజార్

నారాయణఖేడ్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అనేక రకాల వృత్తులు ఉన్నప్పటికీ, సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని మంగల్‌పేట ఇసుక కార్మికులకు కేరాఫ్‌గా ఉండేది. ప్రస్తుతం యాంత్రీకరణ ఎఫెక్ట్‌తో ఎక్స్‌కవేటర్‌లు, మినీ ఎక్స్‌కవేటర్‌లను వినియోగిస్తుండడంతో కూలీలకు పని లేక బేజార్ అయ్యారు.

ఎక్స్‌కవేటర్ల వినియోగం

నారాయణఖేడ్ ప్రాంతం కర్ణాటక, మహారాష్ట్రల సరిహద్దుల్లో ఉండడంతో ఈ ప్రాంతంలో నీటి వనరులు అంతంతమాత్రంగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో అవసరమయ్యే ఇసుకను దూర ప్రాంతంలోని చెరువులు, వాగుల్లోంచి తెచ్చుకోవాల్సి వచ్చేది. ఈ క్రమంలో ఇసుక వ్యాపారులు, లారీల యజమానులు, ప్రధాన రహదారిపై ఉన్న మంగల్‌పేటకు చెందిన కూలీలకు ఇసుక లోడింగ్, అన్‌లోడింగ్‌కు అవకాశం కల్పించారు. నాలుగు దశాబ్దాలుగా కూలీలు ఈ పనులతోనే ఉపాధి పొందుతూ వచ్చారు. రాత్రి, పగలు తేడా లేకుండా లారీ ఎప్పుడు వచ్చినా ఇసుకతో పాటు డస్టును, కంకరను లోడింగ్, అన్‌లోడింగ్ చేసేవారు. ఒక్కో లారీకి రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు తీసుకునేవారు. కూలీల ద్వారా పనులు చేయిస్తే ఆలస్యం అవుతుందని, వ్యాపారులు ఎక్స్‌కవేటర్లను వినియోగిస్తున్నారు. దీంతో ఈ పనులపై ఆధార పడిన కూలీలు, ప్రస్తుతం పనులు లేక తల్లడిల్లుతున్నారు. మంగల్‌పేట్ నారాయణఖేడ్ మున్సిపాలిటీలో ఉన్నందున వారికి ఉపాధిహామీ వర్తించడం లేదు.

భూమి లేక కార్మికులుగా మారాం

మాకు ఎలాంటి భూములు లేక పోవడం వల్ల ఇసుక కార్మికులుగా మారాం. ప్రస్తుతం ఇసుక లోడింగ్, అన్‌లోడింగ్‌కు యంత్రాలను వినియోగిస్తుండడంతో పని లేకుండా పోయింది.

\- శాంతమ్మ, ఇసుక కూలీ

ఉపాధిహామీ వర్తింపజేయాలి

ఇటీవలి వరకు ఇసుక కార్మికురాలిగా ఉపాధి పొందినప్పటికీ, యాంత్రీకరణతో పనులు దొరకడం లేదు. మాకు కనీసం ఉపాధిహామీ పనులకైనా అవకాశం కల్పించాలి.

\- కళావతి, ఇసుక కూలీ


ఖేడ్‌లో లారీ నుంచి మినీ ఇటాచితో అన్‌లోడ్ చేస్తున్న కంకర

న్యాయవాదిపై దాడికి నిరసనగా విధుల బహిష్కరణ

సిద్దిపేట: ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): హన్మకొండలో న్యాయవాది గంధం శివపై పోలీసులు దాడి చేయడాన్ని నిరసిస్తూ గురువారం హుస్నాబాద్ మున్సిఫ్ కోర్టులో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. న్యాయవాదులపై పోలీసులు దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. దాడికి పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్, ఉపాధ్యక్షుడు కన్నోజు రామక్రిష్ణ, జుములాల్ నాయక్, న్యాయవాదులు యాళ్ల శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, కిరణ్, ప్రవీణ్, రఘువీర్, రాజశేఖర్, సంపత్, శ్రీదేవి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు యాక్షన్ ప్లాన్ ఫాలో కావాలి

● ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి

రాయపోల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా విద్యాశాఖ అధికారి నిర్దేశించిన యాక్షన్ ప్లాన్‌ను విధిగా అమలు పరచాలని రీజినల్ జాయింట్ డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం ఆయన సిద్దిపేట జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి రాయపోల్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, జడ్పీ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందిస్తున్నారా.. లేదా? అని ఆరా తీశారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కేజీబీవీ భవన నిర్మాణం పురోగతిపై వివరాలను తెలుసుకున్నారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులకు స్పెషల్ క్లాసులు తీసుకోవాలని, రెగ్యులర్‌గా ప్రత్యేక పరీక్షలు రాయించి వార్షిక పరీక్షలకు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు విద్యార్థులకు స్నాక్స్ అందించాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఎంఈవో సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.


రాయపోల్ జడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న ఆర్‌జేడీ

ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలి: బీఆర్ఎస్

సిద్దిపేట రూరల్/చిన్నకోడూరు/నంగునూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి); కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ జెండాను ఎగరవేయాలని సుడా మాజీ ఛైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లాలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ జెండాపండుగ కార్యక్రమాలను నిర్వహించారు. సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో మారెడ్డి రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రైతు బంధు ఇవ్వకుండా ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎర్ర యాదయ్య, ఆత్మ కమిటీ మాజీ ఛైర్మన్ ప్రభాకర్ వర్మ, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు మేర సత్తయ్య, నాయకులు పాల్గొన్నారు.


సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరులో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చిన్నకోడూరు మండలంలోని విఠలాపూర్, రంగాయిపల్లి గ్రామాల్లో గురువారం బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల సమన్వయకర్త పాల సాయిరాం పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, మాజీ ఎంపీపీ మాణిక్యరెడ్డి, మండలాధ్యక్షుడు కాముని శ్రీనివాస్‌తో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ కనకరాజు, నాయకులు పాల్గొన్నారు.

నంగునూరు మండలంలోని నర్మెట్ట, అప్పలాయచెరువు, ఖైసంపల్లి గ్రామాల్లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అనగోని లింగంగౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యమంస్థాయి నుంచి ఇప్పటి వరకు కష్టపడ్డ ప్రతీ కార్యకర్తకు బీఆర్ఎస్ పార్టీలో మంచి గుర్తింపు ఉంటుందని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా ప్రతీ కార్యకర్త ఇప్పటినుంచే ఒక సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి ఫలాలను ప్రజలకు వివరిస్తూ ప్రజలను చైతన్యం చేయాలన్నారు.

కొమురవెల్లి కేజీబీవీని సందర్శించిన అదనపు కలెక్టర్

సిద్దిపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలకేంద్రంలోని కస్తూర్బాపాఠశాలను గురువారం జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల హాజరు తీరును పరిశీలించారు. నిత్యావసర సరుకుల నిల్వ, భోజన తయారీ పరిశీలించి, విద్యాబోధన తీరుపై సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ.. క్రమశిక్షణతో మెదలాలని, ప్రణాళికాపరంగా చదువుకోవాలని సూచించారు.


కేజీబీవీలో భోజనం తయారీని పరిశీలిస్తున్న అబ్దుల్ హమీద్

టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా తిరుపతి రెడ్డి నియామకంపై హర్షం

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా సిద్దిపేట జిల్లాకు చెందిన ఎ.తిరుపతిరెడ్డి నియామకంపై టీపీటీఎఫ్ సిద్దిపేట జిల్లాశాఖ పక్షాన హర్షం వ్యక్తం చేస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు విజేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేందర్ తెలిపారు. తిరుపతిరెడ్డి గత 30 సంవత్సరాల నుంచి నిబద్ధత కలిగిన ఫెడరేషన్ కార్యకర్తగా మాత్రమే కాకుండా పలు బాధ్యతలను సమర్థంగా నిర్వహించి, అనేక సామాజిక ఉద్యమాల్లో పాల్గొన్నారని గుర్తుచేశారు. నిరంతరం ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేశారన్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే ఉపాధ్యాయ ఉద్యమాలకు ఆయన అపార అనుభవం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కాగా టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా తిరుపతిరెడ్డి ఎంపికకావడం పట్ల అక్బర్‌పేట-భూంపల్లి మండల అధ్యక్షుడు శ్రీనివాస్ హర్షం చేశారు.


తిరుపతిరెడ్డి

ఎస్సీల వర్గీకరణ తీర్మానంపై హర్షం


సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన గంగాజమున

సిద్దిపేట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఎస్సీల వర్గీకరణకు అసెంబ్లీలో ప్రవేశపెట్టడం పట్ల గురువారం హైదరాబాద్‌లోని సీఎం రేవంత్‌రెడ్డిని మిరుదొడ్డి మండలం అందె గ్రామానికి చెందిన కాంగ్రెస్‌పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర కన్వీనర్ గంగాజమున మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఎస్సీవర్గీకరణ అంశాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టి అమలుకు తీర్మానం చేయడం పట్ల మాదిగ, మాదిగ ఉపకులాల్లో సంతోషం నెలకొందన్నారు.

ఇద్దరు దొంగలకు రిమాండ్

సిద్దిపేట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): వరుసదొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. గురువారం మిరుదొడ్డి ఎస్ఐ పరశురాములు వెల్లడించిన వివరాల ప్రకారం.. మిరుదొడ్డి మండలం చెప్యాల గ్రామానికి చెందిన కర్రోల్లస్వామి, రసమల్ల శేఖర్ అనే వ్యక్తులు మండలంలోని చెప్యాల, అల్వాల గ్రామాల్లో వరుసగా దొంగతనాలకు పాల్పడుతున్నారు. చెప్యాల చౌరస్తా వద్ద వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించడంతో వారిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇటీవల చెప్యాల, అల్వాల గ్రామాల్లో దొంగతనాలకు పాల్పడినట్టు విచారణలో వారు అంగీకరించినట్టు ఎస్ఐ తెలిపారు. దీంతో వారిద్దరిని రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు.

కోర్టుకు హాజరుకానివారికి జ్యుడీషియల్ రిమాండ్


వివరాలను వెల్లడిస్తున్న త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్

సిద్దిపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పేకాట కేసులో అరెస్టయిన ఆరుగురు కోర్టుకు హాజరు కాకపోవడంతో వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గురువారం త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ వివరాలను వెల్లడించారు. ఈ మేరకు.. సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్ పల్లి గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు 2018లో పేకాడుతూ పట్టుబడటంతో పోలీసులు అరెస్టు చేశారు. విచారణ నిమిత్తం వారు కొన్ని రోజులుగా కోర్టుకు హాజరు కాలేదు. దీంతో మెజిస్ట్రేట్ నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసినట్టు తెలిపారు. వారిని పట్టుకుని మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా విచారణ అనంతరం జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్టు తెలిపారు. నిందితులను కరీంనగర్ జైలుకు తరలించామన్నారు.

ఘనపూర్‌లో వృద్ధుడి అదృశ్యం

తొగుట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘనపూర్ గ్రామానికి చెందిన అక్కం నరసయ్య (85) ఈ నెల 5న మధ్యాహ్నం ఇంట్లో నుంచి వెళ్లిపోయి తిరిగి ఇంటికి తిరిగిరాలేదు. అతడి కొడుకు పర్శయ్య గురువారం రాత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ రవికాంత్‌రావు తెలిపారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే తొగుట పోలీసులకు సమాచారమందించాలని సూచించారు.


నరసయ్య(ఫైల్)

పాముకాటుతో పాడిగేదె మృతి

సిద్దిపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలం గురువన్నపేట గ్రామానికి చెందిన బ్రాహ్మండ్లపల్లి కనకయ్య పాడిగేదె పాముకాటుతో మృతిచెందింది. కనకయ్య ఎప్పటిలాగే బుధవారం సాయంత్రం వ్యవసాయ బావివద్ద గేదెను కట్టేసి ఇంటికి వెళ్లిపోయాడు. మరునాడు ఉదయం వచ్చేసరికి పాముకాటుకు గురైన గేదె నిర్జీవంగా పడిఉంది. పాడి గేదె మృతితో తనకు రూ.లక్ష నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

ట్రాఫిక్‌కు అడ్డంకిగా ఉన్న బోర్డుల తొలగింపు


రోడ్డుపై ఏర్పాటు చేసిన బోర్డులను తొలగిస్తున్న పోలీసులు

సిద్దిపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణంలోని ప్రధాన రహదారుల్లో రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్న దుకాణాల బోర్డులను గురువారం మున్సిపల్ అధికారులతో కలసి పోలీసులు తొలగించారు. రోడ్డును ఆనుకొని తమ వ్యాపారానికి సంబంధించిన బోర్డులను ఏర్పాటు చేయవద్దని, అలాగే వాహనాలను రోడ్డుపై పార్కింగ్ చేయవద్దని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, ఎస్ఐ మహేశ్, సిబ్బంది ఉన్నారు.

రిటైర్డ్ ఎస్ఐ మృతి పట్ల హరీశ్‌రావు సంతాపం

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేటకు చెందిన రిటైర్డ్ ఎస్ఐ రత్నం గురువారం మృతి చెందారు. ఆయన మృతి పట్ల మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీమంత్రి మాట్లాడుతూ రత్నం ఎస్ఐగా సిద్దిపేటతో పాటు ఇతర ప్రాంతాల్లో ఎంతో నిబద్దతగా సేవలందించారని కొనియాడారు. తన వృత్తిని సామాజిక సేవగా భావించారన్నారు. ఆయన మృతిపట్ల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.


రత్నం(ఫైల్)

రామ, శివ లక్ష లిఖిత నామాల అందజేత

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): హరిహర లిఖిత మహాయజ్ఞం శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ ఆధ్వర్యంలో గ్రామ, గ్రామాన నిర్వహించారు. అందులో భాగంగా గురువారం సిద్దిపేట, చుట్టు పక్కల గ్రామాల నుంచి లక్షకు పైగా రామ, శివ నామాలు లిఖించిన పత్రాలను నాసర్ పుర హనుమాన్ ఆలయంలో సీతారామాంజనేయ సేవాసమితి వారు సేకరించి సంస్థ అధ్యక్షుడు రామకోటి రామరాజుకి ఆలయంలో అందజేశారు. అనంతరం రామకోటి రామరాజును సీతారామ సేవా సమితి వారు ఘనంగా సన్మానించారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నంగునూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని పీసీసీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దేవులపల్లి యాదగిరి అన్నారు. మండలంలోని నర్మెట గ్రామానికి చెందిన కాయితోజు రాజుకు సీఎంఆర్ఎఫ్ కింద ఆర్థిక సాయం మంజూరైంది. ఈ మేరకు రూ.28,500 విలువైన చెక్కును లబ్ధిదారుడి కుటుంబీకులకు యాదగిరి గురువారం అందజేశారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి

సిద్దిపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతంలోని క్రీడాకారులను ప్రోత్సహించాలని బీఆర్ఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ బొంగు రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని కొమురవెల్లి మండలకేంద్రంలో ఇటీవల నిర్వహించిన మండలస్థాయి వాలీబాల్ పోటీ విజేతలతో పాటు క్రీడాకారులకు రూ.10 వేల విలువైన ప్రొఫెషనల్ స్పోర్ట్స్ టీషర్టులను విరాళంగా అందించారు. కార్యక్రమంలోపచ్చిమడ్లస్వామి, మేరుగు కృష్ణ, బూరుగు స్వామి పాల్గొన్నారు.

గజ్వేల్ క్రికెట్ క్లబ్ అధ్యక్షుడిగా విజయ్

గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ నియోజకవర్గ క్రికెట్‌క్లబ్ అధ్యక్షుడిగా గజ్వేల్ పట్టణానికి చెందిన అడ్వకేట్ జక్కుల విజయ్ ఏకగ్రీవంగా ఎన్నికైనారు. గురువారం గజ్వేల్ పట్టణంలో గజ్వేల్ క్రికెట్ క్లబ్ కార్యవర్గం ఎన్నికలు నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా మహ్మద్ లతీఫ్‌ఖాన్, సంతోష్ ఎన్నికయ్యారు.

తెలంగాణ సంస్కృతిలో భాగం 'గుడాలు'


గుడాలపండుగ కార్యక్రమంలో మాట్లాడుతున్న హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ విజయగిరి భిక్షపతి


విద్యార్థులు తయారు చేసి తీసుకొచ్చిన గుడాలు

హుస్నాబాద్ టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి : పోషక విలువలతో కూడిన గింజ ధాన్యాలను ఉడుకబెట్టి చేసే గుడాలు తెలంగాణ సంస్కృతిలో ఓ భాగమని భాగమని హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయగిరి భిక్షపతి పేర్కొన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం తెలంగాణ సంప్రదాయ రుచులను పరిచయం చేయడానికి వివిధ రకాల గింజ ధాన్యాలతో తయారు చేసిన గుడాల పండుగను నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు తయారు చేసిన గుడాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నేటి యువత పిజ్జాలు, బర్గర్లు, కూల్ డ్రింకులు వంటి పోషక విలువలు లేని ఆహారాన్ని తీసుకుంటూ అనారోగ్యం పాలవుతున్నారన్నారు. మన పూర్వీకులు ఈ ఆహారాన్ని తీసుకొని ఆరోగ్యంగా జీవించారని గుర్తు చేశారు. ముఖ్యంగా మధుమేహం, హైబీపీ, రక్తహీనత, విటమిన్ల లోపం మొదలైన వ్యాధులను నివారించడానికి ఈ గుడాలు ఉపకరిస్తాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు బాలరాజు, బి నయనాదేవి, కుమారస్వామి, చంద్రమౌళి, ఫాతిమా, సుధామాధురి, రాజ్యలక్ష్మీ, శ్రీనివాస్ తదితరులున్నారు.

సూరంపల్లిలో కోతకొచ్చిన ఆయిల్‌పామ్


దౌల్తాబాద్ మండలం సూరంపల్లిలో కోసిన ఆయిల్‌పామ్ గెలను పరిశీలిస్తున్న ఏడీఏ మల్లయ్య

సిద్దిపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్‌ను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలితాలను ఇస్తున్నాయని దుబ్బాక ఏడీఏ మల్లయ్య పేర్కొన్నారు. దౌల్తాబాద్ మండల పరిధిలోని సూరంపల్లి గ్రామానికి చెందిన నరేందర్‌రెడ్డి 10 ఎకరాల్లో సాగుచేసిన ఆయిల్ పామ్ పంట మండలంలోనే మొదటి కోత తీరును ఏడీఏ మల్లయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. ఎకరాకు 10 టన్నుల ఆయిల్‌పామ్ దిగుబడి వస్తుందని, రైతులు ఆయిల్‌పామ్ తోటలను సాగు చేసుకోవాలని సూచించారు. సిద్దిపేట జిల్లాలో నంగునూరులో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ అందుబాటులో ఉందని, రైతులు ఎవరూ అధైర్య పడవద్దన్నారు. సిద్దిపేట జిల్లాలో 12వేల ఎకరాల్లో రైతులు ఆయిల్‌పామ్ పంటను సాగు చేస్తున్నారన్నారు. ఏడీఏ వెంట ఏఈ వోలు సంతోష్, బాబు రాజు, తదితరులు ఉన్నారు.

రాయపోల్ మండలం రాంసాగర్ ఉన్నత పాఠశాలలో గురువారం స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఒక రోజు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంఈవో సత్యనారాయణరెడ్డి అభినందించారు.

- రాయపోల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి)



ఘనంగా వికాస పిల్లల జన్మదిన వేడుకలు


పిల్లలతో కేక్ కట్ చేయిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీటీసీ భవన్‌లో బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వికాస పిల్లల జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి పాల్గొని మాట్లాడుతూ బాల వికాస సంస్థ వ్యవస్థాపకురాలు బాలక్క ఎన్నో స్వచ్ఛంద కార్యక్రమాలు చేస్తూ సేవలందించడం అభినందనీయమని కొనియాడారు. బాలవికాస ప్రోగ్రాం మేనేజర్ లత మాట్లాడుతూ సిద్దిపేట ఏరియాలోని బాలవికాస సంస్థ పనిచేసే గ్రామాల్లో 26 ఏళ్ల నుంచి తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలను దాదాపు 1500మంది వికాస పిల్లలను సంస్థ అక్కున చేర్చుకొని వారిని చదివిస్తుందన్నారు. అలాగే వారి బాగోగులు తెలుసుకుంటూ ఏటా జన్మదిన వేడుకలు జరుపుతూ బాలవికాస సంస్థ అండగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో దాతలు చల్లారం రాజశేఖర్ రెడ్డి, భాస్కర్, పరశురాములు, బాలవికాస మహిళా కోఆర్డినేటరు అన్న మేరీ, సుజాత, లక్ష్మి, వికాస పిల్లలు, మహిళలు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగకు సన్మానం


మందకృష్ణను సన్మానిస్తున్న హుస్నాబాద్ ఎమ్మార్పీఎస్ నాయకులు

సిద్దిపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన సందర్భంగా మందకృష్ణ మాదిగను గురువారం హైదరాబాద్‌లో హుస్నాబాద్ ఎమ్మార్పీఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలసి సన్మానించారు. లక్ష డప్పులు, వెయ్యి గొంతులు కార్యక్రమాన్ని త్వరలో నిర్వహిస్తామని ఈ సందర్భంగా తమతో చెప్పినట్టు నాయకులు తెలిపారు. డప్పుల కొనుగోళ్లు ఎవరూ ఆపవద్దని సూచించినట్టు తెలిపారు. మందకృష్ణను కలసినవారిలో ఎమ్మార్పీఎస్ నాయకులు లింగాల సాయన్న, ముక్కెర సంపత్‌కుమార్, మాట్ల వెంకటస్వామి, కొలుగూరి అశోక్ తదితరులున్నారు.

నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలి

గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని జగదేవ్‌పూర్, మర్కుక్ మండలాల్లో నెలకొన్న నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం గజ్వేల్ పట్టణంలోని ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు నెలలుగా మిషన్ భగీరథ నీటిని గ్రామంలో ప్రజలందరికీ సరిపడా సరఫరా చేయడంలేదని ఆరోపించారు. వేసవి ప్రారంభం కాకముందే ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. ప్రజలకు సరిపడేంతగా నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలకు సమీకరించి ఆర్డీవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

కేజీబీవీఉపాధ్యాయులను క్రమబద్ధీకరించాలి

గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీ ఉపాధ్యాయులను, సమగ్ర శిక్షణ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పాపగారి పాపిరెడ్డి, జిల్లా కార్యదర్శి జల్లెల శ్రీనివాస్‌యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని కేజీబీవీ, సింగాటం, అహ్మదీపూర్, శేరిపల్లి, కొల్గూరు, పిడిచెడు, బెజుగామ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానాన్ని అందరికీ అమలు చేయాలని కోరారు. టీపీటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలతో ఉత్తములుగా ఎదగాలి


చేర్యాల కేజీబీవీలో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎల్. శ్రీను

సిద్దిపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో ఉన్నత లక్ష్యాలతో ఉత్తములుగా ఎదగాలని చేర్యాల సీఐ ఎల్ శ్రీను సూచించారు. చదువుకునే సమయంలో చెడు ఆలోచనలకు తావివ్వకుండా ఏకాగ్రతతో విద్యనభ్యసించాలన్నారు. చేర్యాల పట్టణంలోని కస్తూర్బా పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు ఈవ్ టీజింగ్, సైబర్ నేరాలు, పోలీసు నూతన చట్టాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలనిసూచించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణవేణి, ఉపాధ్యాయులు, షీ టీమ్‌బృందం పాల్గొన్నారు.

● దౌల్తాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): దౌల్తాబాద్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో సైబర్ నేరాలు, షీటీంలపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తొగుట సీఐ లతీఫ్ మాట్లాడుతూ.. మహిళలు, విద్యార్థినుల రక్షణ కోసం షీ టీం ఏర్పాటు చేశామని, ఏదైనా ఆపదలో ఉంటే 100కు డయల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్ దీప్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

9న శతసహస్ర సూర్య నమస్కారాల ప్రదర్శన

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ బాలికల పాఠశాల మినీ స్టేడియంలో ఈ నెల 9న నిర్వహించనున్న శత సహస్ర సూర్య నమస్కారాల ప్రదర్శనను వండర్ బుక్ ఆఫ్ రికార్డులోకి నమోదు చేయడానికి సంకల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం సిద్దిపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వ్యాస మహర్షి యోగా సొసైటీ, సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్, భారతీయస్వాభిమాన్ ట్రస్టు ప్రతినిధులు తోట అశోక్, నిమ్మ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ శత సహస్ర సూర్య నమస్కారాల ప్రదర్శన ఉదయం 6గంటలకు ఉంటుందని తెలిపారు. ఈ క్రమంలో లక్షకు పైగా సూర్య నమస్కారాల ప్రదర్శనతో వండర్ బుక్ ఆఫ్ రికార్డులోకి నమోదయ్యే అవకాశముందన్నారు. ఆసక్తి గలవారు రిజిస్ట్రేషన్ చేసుకుని తమ శక్తి మేరకు సూర్య నమస్కారాలు చేయవచ్చని తెలిపారు. ప్రదర్శనలో పాల్గొన్న వారికి మెడల్స్‌తో పాటు సర్టిఫికెట్లను అందిస్తామన్నారు. అదేవిధంగా రాష్ట్రస్థాయి సూర్య నమస్కారాలు పోటీలు జరుగుతాయని తెలిపారు. 25 ఏళ్ల లోపు, 25 ఏళ్ల పైబడిన వారికి వేర్వేరుగా పోటీలు జరుగుతాయని తెలిపారు. మహిళలకు, పురుషులకు ప్రత్యేకంగా పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

చేర్యాలలో నల్లబ్యాడ్జీలతో వీఆర్ఏల నిరసన

సిద్దిపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): వీఆర్ఏల అరెస్ట్‌ను ఖండిస్తూ చేర్యాల తహసీల్ కార్యాలయ వీఆర్ఏలు గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి కార్యాలయ ఆవరణలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వీఆర్ఏల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకోకపోవడం తగదని, వీఆర్ఏల వారసులకు ఉద్యోగాల కల్పనకు సంబంధించిన జీవో నెం.81,85లను అమలుచేయాలని కోరారు. తమకు ఇచ్చిన హామీలు నెరవేర్చి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బొల్లె మల్లేశం, సత్తాల మహేశ్, సనాది ప్రవీణ్‌కుమార్, జక్కుల పర్శరాములు, అరిగె సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.